క్లుప్తంగా

వాసుపల్లి గెలుపు కోరుతూ గాయత్రి హోమం



హోమం నిర్వహిస్తున్న శ్రీశారదాదేవి మహిళా సంఘం ప్రతినిధులు

దాబాగార్డెన్స్ : దక్షిణ నియోజకవర్గ అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ ఎన్నికల్లో అఖండ మెజార్టీతో విజయం సాధించాలని శ్రీ శారదాదేవి మహిళా సంఘం శుక్రవారం గాయత్రి హోమం నిర్వహించింది. వాడవీధిలో గల సంఘం కార్యాలయం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో సభ్యులు మాట్లాడుతూ నిరంతరం ప్రజాసేవలో ఉంటూ నియోజకవర్గ సమస్యలు పరిష్కరించడమే కాక ముఖ్యంగా జగదాంబ జంక్షన్ నుంచి పాతపోస్టాఫీస్ రాణిబొమ్మ వరకు ఉన్న ఇరుకు రోడ్డుని 60 అడుగుల రోడ్డుగా విస్తరించి దశాబ్దాల పాతనగర వాసుల కోరికను నెరవేర్చారన్నారు. ఆయన గెలుపు కోరుతూ గాయత్రి హోమం నిర్వహించడమైందన్నారు.

మనోవికాస శిక్షణ శిబిరం ప్రారంభం



మనో వికాస శిక్షణలో బాలబాలికలు

దాబాగార్డెన్స్ : వన్‌టౌన్‌లోని రాజప్పనాయుడు వీధిలో గల శ్రీగీతా భవన్‌లో 25వ బాల బాలికల మనోవికాస శిక్షణ శిబిరం శుక్రవారం ప్రారంభమైంది. గీతా ప్రచార సమితి అధ్యక్షుడు చావలి విశ్వేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి శిబిరాన్ని ప్రారంభించారు. విద్యార్థులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని తద్వారా చక్కటి జ్ఞానం పొందాలన్నారు. వివిధ రంగాలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శిబిరం చైర్‌పర్సన్ డి. కనకవల్లి, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంపీ రాజశేఖర్, కోశాధికారి జీవీఆర్ ప్రసాద్, సమితి ప్రతినిధులు ఏఆర్ భానుమతి, ఆదిత్య శర్మ తదితరులు పాల్గొన్నారు.

పైడిమాంబ జాతరకు ఏర్పాట్లు



జాతర ప్రచార పత్రికను ఆవిష్కరిస్తున్న సంఘ అధ్యక్షుడు బోర ఈశ్వరరావు

సీతంపేట: సీతంపేట గ్రామ దేవత పైడిమాంబ అమ్మవారి జాతర మహోత్సవం జూన్ 11న జరగనుందని శ్రీకృష్ణ యువజన సేవా సంఘం అధ్యక్షుడు బోర ఈశ్వరరావు తెలిపారు. అమ్మవారి ఆలయంలో శుక్రవారం జాతర ప్రచార పత్రికలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. జూన్ 9న పండగ చాటింపు, 10న తొలేళ్లు, 11న ప్రధాన పండుగ జరుగుతాయని చెప్పారు. సంఘ కార్యదర్శి సారిపిల్లి గంగరాజు మాట్లాడుతూ అమ్మవారి పండగ ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షుడు నమ్మి వెంకట్, కోశాధికారి బోర వెంకటరమణ, వారాధి శ్రీను, సానబోయిన సురేష్, మంచిపిల్ల ఆదిబాబు, ఇసరపు అప్పారావు, ఉత్సవ కమిటీ చైర్మన్ ఇసరపు రాజేష్, ఆలయ అర్చకుడు శివగణేష్ శర్మ, గ్రామ యువత, పెద్దలు పాల్గొన్నారు.

నేడు వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహించనున్నారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరుగుతాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

సంక్షేమ ప్రదాతను గెలిపించుకుందాం

- దక్షిణలో వైఎస్సార్‌సీపీ నేతల ముమ్మర ప్రచారం
- అఖండ స్వాగతం పలికిన ప్రజలు

వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి, ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూ పార్టీ శ్రేణులు ముమ్మరంగా ప్రచారం చేశారు. నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాల్లో స్థానికులను కలుసుకుని ఓటు అభ్యర్థించారు.

దాబాగార్డెన్స్/అల్లిపురం/జగదాంబ/మహారాణిపేట



30వ వార్డులో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెంటపల్లి సత్యనారాయణ, ఎస్‌సీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దశమంతుల చిన్ని, వద్దాది విజయకుమార్ తదితరులతో కలిసి ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం



34వ వార్డు కొబ్బరితోటలో ప్రచారం చేస్తున్న ఎన్నికల పరిశీలకులు ద్రోణంరాజు శ్రీ వత్సవ్, కార్పొరేటర్ తోట పద్మావతి, లింగం శ్రీనివాస్, దూడ అప్పారావు, రాములమ్మ, గాలి పార్వతి, కొండబాబు తదితరులు

ప్రచార పర్వం



33వ వార్డు కుమ్మరవీధిలో ప్రచారం చేస్తున్న వాసుపల్లి సూర్య, బొడ్డేటి ప్రసాద్, కొదమంచిలి శ్రీను తదితరులు



మేదర వీధిలో ప్రచారం చేస్తూ కరపత్రాలు పంచుతున్న వాసుపల్లి సతీమణి ఉషశ్రీ. ఈ సందర్భంగా ఆమె పూలసందు, మంచాలవీధి, పూర్ణామార్కెట్ ప్రాంతాల్లో ప్రజలను కలుసుకుని ఓటు అభ్యర్థించారు.



39వ వార్డు ఇన్‌చార్జి కొల్లిసింహాచలం నల్లవారివీధి, రుద్రవారివీధి, కుర్పా మార్కెట్, రాణిబొమ్మ, వాడవీధి, గానుగలవీధి, చిలకవీధి తదితర ప్రాంతాల్లో పార్టీ నాయకులతో కలిసి ప్రచారం చేశారు.

మీ అభిమానానికి రుణపడి ఉంటాం

- తమకు మద్దతు పలికిన సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్‌బాబు అభిమానులకు బొత్స ఝాన్సీ, వాసుపల్లి కృతజ్ఞతలు



ర్యాలీలో ఓటు అభ్యర్థిస్తున్న ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్ : సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్‌బాబు అభిమానులు తమపై చూపిస్తున్న అభిమానానికి రుణపడి ఉంటామని వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్ కుమార్ తెలిపారు. శుక్రవారం జగదాంబ జంక్షన్‌లో గల మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి విగ్రహం నుంచి లేపాక్షి జంక్షన్, టర్నర్ చౌల్ట్రీ, పూర్ణామార్కెట్, ఏవీఎన్ కాలేజీ డౌన్‌రోడ్డు, టౌన్‌కొత్తరోడ్డు, రీడింగ్‌రూమ్, కురుపాం మార్కెట్, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ మీదుగా పాతపోస్టాఫీస్ వరకు నిర్వహించిన ర్యాలీలో సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్‌బాబు చిత్ర గీతాలతో అభిమానులు నృత్యాలు చేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల ప్రచారానికి మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఎంపీ ఝాన్సీలక్ష్మి మాట్లాడుతూ సేవ చేసే వాసుపల్లి గణేష్‌కుమార్‌ని, తనను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. వాసుపల్లి గణేష్‌కుమార్ మాట్లాడుతూ విశాఖపట్నం పరిపాలనా రాజధానిగా వస్తే యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. రెండు సార్లు తన గెలుపునకు కృష్ణ, మహేష్‌బాబు ఫ్యాన్స్ ఎంతో తోడ్పాటు అందించారన్నారు. వారికి రుణపడి ఉంటానన్నారు. రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ చైర్మన్ బొల్లవరపు జాన్‌వెస్లీ, రెల్లి కార్పొరేషన్ చైర్మన్ వద్దాది మధుసూదనరావు, విశాఖ సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రతినిధులు గాజుల వెంకట్రావు, డొప్ప రమణ, వాసర్ల సుబ్రహ్మణ్యం (బుజ్జి), బీసీహెచ్ అప్పారావు, పార్టీ నాయకులు దశమంతుల మాణిక్యాలరావు, మహ్మద్ షరీఫ్, అధిక సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై గ్రీన్ క్లైమేట్ అవగాహన

మహారాణిపేట : మనం వేసే ఓటే మన భవిష్యత్తును నిర్ణయిస్తుందని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జీవో వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం అన్నారు. శుక్రవారం ఉదయం ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరుతూ స్వీప్ కార్యక్రమాన్ని ఫిషింగ్ హార్బర్ చేపలు మార్కెట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేధావులు, విద్యార్థులు, కార్మికులు, ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. తమకు ఇష్టమైన నాయకులు పోటీలో లేకుంటే ×నోట్బాబటన్ నొక్కి పైన ఉన్న వారెవరూ కాదు అని, తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యాక్షన్ ఎయిడ్ ఫెలోషిప్ ప్రతినిధి కృష్ణకుమారి, గ్రీన్ క్లైమేట్ టీం వలంటీర్లు రవితేజ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



ఓటు హక్కుపై కరపత్రాలు పంపిణీ చేస్తున్న జేవీ రత్నం

మతతత్వ పార్టీలకు బుద్ధి చెప్పండి

ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్



జామియా మసీదు ప్రతినిధులతో వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం : మతతత్వ పార్టీలకు బుద్ధి చెప్పాలని దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం సున్నపువీధిలోని జామియా మసీదులో ప్రార్థనలు ముగించుకుని వచ్చిన ముస్లింలను కలిసి ఓటు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీతో జత కట్టిన టీడీపీ, జనసేన పార్టీలను ఓడించాలన్నారు. ముస్లింలకు సముచిత స్థానం కల్పించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. దక్షిణలో ముస్లింల కోసం ప్రత్యేకంగా ప్రజాదర్బార్‌లు ఏర్పాటు చేశానని, మళ్లీ తనకు అవకాశం ఇస్తే దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో మహ్మద్ షకీల్, నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షుడు ముజీబ్‌ఖాన్, ముస్లిం మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి ఖాజావల్లి, రాష్ట్ర రెల్లి కార్పొరేషన్ చైర్మన్ వద్దాది మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో పి. శ్రీనివాసుల రెడ్డి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే కనకమహాలక్ష్మి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించాలి.



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి

అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటాలి

మురళీనగర్: త్వరలో అయోధ్యలో జరగనున్న అంతర్జాతీయ స్థాయి పోటీల్లో విశాఖ నగర మాస్టర్స్ అథ్లెట్స్ సత్తా చాటాలని వాకర్స్ ఇంటర్నేషనల్ పీఆర్‌వో కమల్ బైద్ ఆకాంక్షించారు. జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి ఇంటర్నేషనల్ స్థాయి పోటీలకు అర్హత సాధించిన విశాఖ క్రీడాకారులను ఆయన అభినందించారు. మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులో శుక్రవారం నిర్వహించిన విజయోత్సవ అభినందన సభలో ఆయన మాట్లాడారు. ఏప్రిల్ 26 నుంచి 28 వరకు ముంబైలో నిర్వహించిన 43వ నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్-2024లో ఆంధ్రప్రదేశ్ తరఫున విశాఖ క్రీడాకారులు పాల్గొని వివిధ విభాగాల్లో స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించారు. మురళీనగర్ చేరుకున్న పతకాల విజేతలు డి.సరోజిని, బి.విజయలక్ష్మి, డి.రమణమ్మ, టి.సుధాకర్, ఎస్.దుర్గ, అమిత్, లక్ష్మణరావు, పాటిల్, ఎం.తాతారావు, ఎం.రామారావును ఘనంగా సత్కరించారు. యూనివర్సల్ యూత్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు సిహెచ్.వంశీ, ఇండియన్ మాస్టర్స్ అథ్లెటిక్స్ సెక్రెటరీ జనరల్ ఎం.వరప్రసాద్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా చెస్ పోటీలు



చదరంగం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చదరంగం ఉచిత శిక్షణలో భాగంగా శుక్రవారం విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. శిక్షకుడు ఎస్.ఉమాపతి పర్యవేక్షణలో ఉత్సాహంగా జరిగిన చెస్ పోటీల్లో ఏడేళ్ల లోపు విభాగంలో రుత్విక్, ఘనస్కంద్, అక్షర మొదటి మూడు స్థానాల్లో నిలవగా.. 8-10 ఏళ్ల విభాగంలో నిఖిల్, హర్షిత్, తన్వీర్, 11-15 ఏళ్ల విభాగంలో చండీశ్వర్, కె.లోకేష్, బీఏ స్వాతి, మహిళలకు నిర్వహించిన పోటీల్లో రమాదేవి, సుజన, జోషిక మొదటి మూడు స్థానాల్లో విజేతలుగా నిలిచారు. వీరికి త్వరలో బహుమతులు అందిస్తామని వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి, కార్యదర్శి చెల్వరాజు తెలిపారు.

జగన్ వెంటే.. మత్స్యకారులంతా

- దక్షిణలో వాసుపల్లిని.. పలాసలో సీదిరిని గెలిపించుకోవాలి
- కపట ప్రేమ ఒలకబోసే పవన్ కల్యాణ్‌ను నమ్మొద్దు
- మత్స్యకారులకు జేఏసీ పిలుపు



సమావేశానికి హాజరైన మత్స్యకార నాయకులు

దాబాగార్డెన్స్: మత్స్యకారులను గుర్తించి, సముచిత స్థానం కల్పించిన వైఎస్సార్ సీపీకే మద్దతు పలకాలని మత్స్యకార జేఏసీ పిలుపునిచ్చింది. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మత్స్యకార జేఏసీ చైర్మన్ రాజశేఖర్, వైస్ చైర్మన్ తెడ్డు శంకర్, మాజీ కార్పొరేటర్లు చింతపల్లి పోతురాజు (పులి రాజు), గరికిన గౌరీ, మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన నాయకుడు డాక్టర్ మూగి శ్రీనివాసరావు, గంపల గిరిధర్ మాట్లాడారు. చట్టసభల్లో మత్స్యకారుల సమస్యలపై గళం విప్పే నాయకుడినే ఎన్నుకోవాలన్నారు. దక్షిణ నియోజకవర్గం నుంచి రెండు సార్లు గెలిచిన వాసుపల్లి గణేష్‌కుమార్‌ను, పలాస నియోజకవర్గం నుంచి బరిలో నిలిచిన సీదిరి అప్పలరాజును గెలిపించుకోవల్సిన బాధ్యత మత్స్యకారులపై ఉందన్నారు. మత్స్యకారులను హేళనగా చూసిన కూటమికి తగిన బుద్ధి చెప్పాలని విజ్ఞప్తి చేశారు.

మత్స్యకారులను గుర్తించింది సీఎం జగనే..

మత్స్యకారులను గుర్తించింది సీఎం జగన్‌మోహన్ రెడ్డేనని, కోలా గురువులు, మోపిదేవి వెంకటరమణ వంటి ఎంతో మంది మత్స్యకారులను నాయకులను చేసింది వైఎస్సార్‌సీపీయే అన్నారు. ఇటు తెలుగుదేశం, అటు జనసేన, మరోవైపు బీజేపీ ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఒక్క సీటైనా మత్స్యకారులకు కేటాయించాయా? అని ప్రశ్నించారు. పవన్ కల్యాణ్ విశాఖ సభలో మత్స్యకారులపై ప్రేమ ఒలకబోయడం విడ్డూరంగా ఉందన్నారు. ఓట్ల కోసమైతే మత్స్యకారులు కావాలా? చట్టసభలకు వద్దా? అంటూ దుయ్యబట్టారు. మత్స్యకారులపై నీవు జాలి పడక్కర్లేదు. నీకు దమ్ము.. ధైర్యం ఉంటే మత్స్యకారులకు నీవు.. నీ కూటమి ఏం ఒరగబెట్టారో తెలపాలన్నారు. పవన్.. నీకు ఉత్తరాంధ్ర ఆట నేర్పిందన్నావ్. జీవితం ఇచ్చిందన్నావ్. మత్స్యకారుడు లేని ఉత్తరాంధ్రను చూడలేనన్నావ్.. పైపై మాటలతో ప్రేమ ఒలకబోసావ్.. మత్స్యకారులకు అడ్డాగా ఉన్న విశాఖ దక్షిణ నియోజకవర్గాన్ని మత్స్యకారుడికి ఎందుకు కేటాయించలేదో చెప్పాలన్నారు. గత ఏడాది ఫిషింగ్ హార్బర్‌లో బోట్లు కాలి బుడిదైతే.. జగన్‌మోహన్‌రెడ్డి స్పందించి 24 గంటల్లోనే కోట్లాది రూపాయల నష్టపరిహారం చెల్లించలేదా? అది మీకు కనపించలేదా? అని ప్రశ్నించారు. మత్స్యకారుల కష్టాలను నేరుగా చూసిన వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డని, అటువంటి వ్యక్తిని గెలిపించుకోవల్సిన బాధ్యత మత్స్యకారులందరిపై ఉందన్నారు. 175 నియోజకవర్గాల్లో ఏ ఒక్క నియోజకవర్గంలో పెట్టలేని ప్రజాదర్బార్‌లు నిర్వహించి సమస్యలు పరిష్కరించిన వ్యక్తి వాసుపల్లి గణేష్‌కుమార్ అని కొనియాడారు.

రెండు పడవలపై నడిచిన వ్యక్తిని గెలిపించొద్దు..

రెండు పడవలపై నడిచిన వ్యక్తిని గెలిపించాలా? అందుబాటులో లేని వ్యక్తి.. కనీసం నియోజకవర్గంపై పట్టులేని.. సమస్యలు ఎరుగని వ్యక్తిని గెలిపించుకోవాలో.. నిత్యం ప్రజల్లో ఉంటూ సమస్యలు తెలుసుకుంటూ పరిష్కరిస్తున్న వాసుపల్లిని గెలిపించుకోవాలో నియోజకవర్గ ప్రజలు తెలుసుకోవాలన్నారు. వంశీకృష్ణ..నీవు నిజాయితీగా నడుచుకుంటే.. నీ ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి రావాలే తప్ప.. ఇటు ఇక్కడ.. అటు అక్కడ తైతక్కలు ఆడకూడదని హితవు పలికారు. సమావేశంలో మత్స్యకార సంఘ నాయకులు వాసు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి జోరుగా చేరికలు



వాసుపల్లి గణేష్‌కుమార్ సమక్షంలో పార్టీలో చేరిన పాదుపు సంఘాల మహిళలు

- వాసుపల్లి సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్న పలు పార్టీలు, సంఘాల నేతలు



వాసుపల్లి సమక్షంలో పార్టీలో చేరిన సీనియర్ న్యాయవాది పార్థసారథి, కోసూరి కేదార్నాథ్



పార్టీలో చేరిన నాయీ బ్రాహ్మణ సంఘం సభ్యులతో వాసుపల్లి గణేష్‌కుమార్



పార్టీలో చేరిన జనసేన కార్యకర్తలతో వాసుపల్లి

అల్లిపురం : వైఎస్సార్‌సీపీ దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్‌కు రోజు రోజుకి పలు పార్టీల నాయకులు, సంఘాల ప్రతినిధుల మద్దతు పెరుగుతోంది. దీంట్లో భాగంగా పార్టీ నాయకుడు గంపల గిరిధర్, మైలపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం సీనియర్ న్యాయవాది పార్థసారథి, కోసూరి కేదార్నాథ్ వాసుపల్లి గణేష్‌కుమార్‌కు మద్దతు తెలిపారు.

41వ వార్డు యువత మద్దతు...

సుబ్బలక్ష్మీనగర్‌కు చెందిన 30 మంది యువత జేసీఎస్ మండల అధ్యక్షుడు కోడిగుడ్ల శ్రీధర్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వారికి కండువాలు వాసుపల్లి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో సుందరేశ్వరన్, పవన్, లవరాజు, వల్లి, ప్రకాష్, అవినాష్, శ్యామ్, ప్రవీణ్, వెంకటేష్, రాంబాబు తదితరులు ఉన్నారు.

పార్టీలో చేరిన పొదుపు సంఘాల మహిళలు..

వాసుపల్లి గణేష్‌కుమార్‌కు వివిధ పొదుపు సంఘాల సభ్యులు మద్దతు తెలిపాయి. 35వ వార్డు టెంకి దుర్గా ఆధ్వర్యంలో ఎనిమిది పొదుపు సంఘాల మహిళలు భారీగా పార్టీలో చేరారు. వారికి కండువా కప్పి వాసుపల్లి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మదీనా, సత్యసాయి, లోవత, సాయిదుర్గ, హరి కళాంజనేయ, శ్రీరామ గ్రూపు మహిళలు ఉన్నారు.

నాయీ బ్రాహ్మణ సంఘం మద్దతు..

నాయీ బ్రాహ్మణ సంఘం నగర అధ్యక్షుడు వీరేశ్వరరావు, త్రినాథ్ ఆధ్వర్యంలో డైరెక్టర్ వెంపట నూకరాజు ఆధ్వర్యంలో పలువురు పార్టీలో చేరారు. వారికి కండువా కప్పి వాసుపల్లి పార్టీలోకి ఆహ్వానించారు.

35వ వార్డు నుంచి..

అల్లిపురం : పార్టీ ప్రతినిధులు టెంకి దుర్గా, గండిబోయిన చిన్న ఆధ్వర్యంలో 30 మంది జనసేన శ్రేణులు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి కండువాలు కప్పి వాసుపల్లి గణేష్‌కుమార్ పార్టీలోకి ఆహ్వానించారు.

వేసవి ప్రత్యేక రైళ్ల నిర్వహణ

తాటిచెట్లపాలెం: వేసవి రద్దీ దృష్ట్యా సికింద్రాబాద్-బ్రహ్మపూర్-సికింద్రాబాద్ మధ్య అధికారులు పలు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నారు.

సమ్మర్ స్పెషల్ రైళ్ల వివరాలిలా..

- సికింద్రాబాద్-బ్రహ్మపూర్(07035) రైలు ఈ నెల 11, 14 తేదీల్లో రాత్రి 8.45 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.33 గంటలకు దువ్వాడ చేరుకుని, తిరిగి 9.38 గంటలకు బయలుదేరి అదేరోజు మధ్యాహ్నం 2.45 గంటలకు బ్రహ్మపూర్ చేరుకుంటుంది.
- తిరుగు ప్రయాణంలో బ్రహ్మపూర్-సికింద్రాబాద్(07036) రైలు ఈ నెల 12, 15 తేదీల్లో సాయంత్రం 4.45 గంటలకు బ్రహ్మపూర్‌లో బయలుదేరి అదేరోజు రాత్రి 9.55 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడ నుంచి 10 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 10.05 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది.
- సికింద్రాబాద్-బ్రహ్మపూర్(07027) స్పెషల్ రైలు ఈ నెల 10వ తేదీ రాత్రి 8.45 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.33 గంటలకు దువ్వాడ చేరుకుని, తిరిగి 9.38 గంటలకు బయలుదేరి అదేరోజు మధ్యాహ్నం 2.45 గంటలకు బ్రహ్మపూర్ చేరుకుంటుంది.